క్లుప్తంగా

రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థినికి అభినందన



చెరిషా సెల్వరాజ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఉక్కునగరం: దేశ రాజధానిలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్‌సీసీ తరఫున పాల్గొన్న విద్యార్థిని చెరిషా సెల్వరాజ్‌ను డీపాల్ పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చెరిషా న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లోని సాంస్కృతిక విభాగానికి ఏపీ, తెలంగాణా ఉమ్మడి ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ఎంపికై ంది. ఇందుకోసం విశాఖలో జరిగిన ఐయూసీ, సికింద్రాబాద్‌లోని ఐజీసీ నిర్వహించిన గ్రూప్ డాన్స్, బాలెట్ డాన్స్ పోటీల్లో పాస్ కావడంతో చెరిషాను పరేడ్‌కు ఎంపిక చేశారు. చెరిషా రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొని వచ్చిన సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ క్రిస్టీ, డీన్ ఆఫ్ స్టడీస్ ఫాదర్ షిజోయ్, ఫాదర్ షాజీ, ఫాదర్ ప్రవీణ్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారిణి జి. లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల వికాస్ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న బాలలు

అగనంపూడి: సత్యసాయి సేవా సమితి, భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో కొండయ్యవలస బాల వికాస్ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు కార్మిక సంఘం నాయకుడు బి.సత్యనారాయణ మాట్లాడుతూ బాల వికాస్ కేంద్రాల ద్వారా బాలల్లో అన్ని రంగాల్లో వికాసం కనిపిస్తోందన్నారు. ఉత్తమ మార్గంలో నడుచుకోడానికి చక్కటి వేదికగా మారుతుందన్నారు. బాల వికాస్ గురుజీ చిత్తా గౌతమ్ డిప్లొమాలో 9వందలకు గాను 887 మార్కులు సాధించడంతో అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి బాల వికాస్ గురువులు అల్లం రమాదేవి, అల్లారపు త్రివేణి, స్వప్న, జోగేశ్వర్, సాయి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా రాజశ్యామల



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం రాజశ్యామల అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రకృతి సిద్ధంగా లభించే అన్ని రకాల పోషక పదార్థాలతో కూడిన కాయగూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా ఆయా దినుసులలో ఉండే శక్తి,సంపూర్ణ పోషణ మనకు చేకూరి ఆరోగ్యవంతంగా ఉంచుతుందని భక్తుల విశ్వాసం.కాలగమనంలో రుతుమార్పుల ద్వారా ఉత్పన్నమయ్యే అనేక రకాల మధుర ఫలాల అలంకరణ వీక్షణం వల్ల భక్తులు తమ తమ జీవితాలను షడ్రసోపేతంగా సాగించే కటాక్షాన్ని అమ్మవారు కలిగిస్తుందని ప్రతీతి. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో రాజశ్యామల హోమం నిర్వహించారు.



నాడు
రేషన్ సరకులు తీసుకోవాలంటే ప్రతీ నెలా కష్టమే. రేషన్ డిపో ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూసేస్తారో తెలియని అనిశ్చితి.. డిపో తెరిచిన వెంటనే లబ్ధిదారులు ఒక్కసారిగా బారులు తీరడం.. ఎక్కడో ఉన్న రేషన్ దుకాణం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయడం.. ఆపై తమకే ముందు ఇవ్వాలంటూ గొడవలు.. సకాలంలో సరకులు విడిపించుకోకపోతే మిగిలిన సరకును రేషన్ డీలర్లు అమ్మేసుకుని సొమ్ము చేసుకోవడం.. ఇదీ పరిస్థితి.

నేడు
ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా అమలవుతోంది. రేషన్ సరుకుల కోసం పనులు మానుకుని పడిగాపులు పడే బాధలు తప్పాయి. మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల చెంతకే సరకులను అందిస్తున్నారు. రూట్ మ్యాపింగ్, జీపీఎస్ ట్రాకింగ్, సీసీ కెమెరా విధానం, బయోమెట్రిక్ వంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున అక్రమాలకు తావులేదు. ఈ విధానంతో లబ్ధిదారులు కూడా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే రేషన్

ప్రతి నెలా పంపిణీ

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

మండలంలో రేషన్ కార్డులు	మండలంలోని రేషన్ డిపోలు	వాహనాలు	వాహనాల్లో వర్కర్లు
22,516	28	14	14



నడుపూరులో మొబైల్ వాహనం ద్వారా ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ: ప్రజా పంపిణీ వ్యవస్థ అంతటా సమర్థవంతంగా అమలవుతోంది. ప్రజలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులను మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్నారు.

ముందుగానే సమాచారం ఇచ్చి.. : రేషన్ సరకుల పంపిణీ గురించి లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పెడుతున్నారు. వారి ఇంటి వద్దకే రేషన్ వాహనం వస్తుందని చెప్పడంతో లబ్ధిదారులు సిద్ధంగా ఉంటున్నారు. ఆ వాహనం ద్వారా హారన్ వేసిన వెంటనే లబ్ధిదారులు ఒక్కొక్కరిగా వచ్చి సరుకులు విడిపించుకుంటున్నారు. ఆ ప్రాంతంలోని ఆఖరి లబ్ధిదారు వరకూ రేషన్ సరకులు ఇచ్చిన తర్వాత మరో ప్రాంతానికి వెళ్తున్నారు.

తూకాల్లో మోసాలకు చెక్ : గతంలో రేషన్ డిపోల్లో తూకాలకు మోసాలకు పాల్పడేవారనే ఫిర్యాదులు వెల్లువెత్తేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి మోసాలక్ చెక్ చెప్పారు. ఎలక్ట్రానిక్ తూనికా యంత్రాల ద్వారా ఒక్క గ్రాము కూడా తక్కువ కాకుండా నిక్కచ్చిగా తూచి ఇస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పిండి ఇతర సరకులు గతానికి భిన్నంగా ఇంటికి చేరవేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి.

ముంగిటకే తెచ్చి ఇస్తున్నారు



ఒకప్పుడు ఎక్కడో దూరంగా ఉన్న రేషన్ డిపోకు వెళ్లి నిరీక్షించాల్సి వచ్చేది. ఆ తర్వాత తాపీగా డీలరు వచ్చేవాడు. కానీ ఇప్పుడు ఇంటి ముందుకు వాహనాన్ని పంపిస్తున్నారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో ముందుగానే వలంటీర్ తెలుపుతున్నారు. దీంతో మేము సాఫీగా సరుకులు తీసుకుంటున్నాం. ఈ విధానంతో ఇబ్బంది లేకుండా ఉంది.
– కండిపల్లి నూకమ్మ, 76వ వార్డు, పెద నడుపూరు

పంపిణీ విధానం బాగుంది



కొందరు రేషన్ డీలర్లు అప్పట్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. వారికి నచ్చితే సరుకులు ఇవ్వడం, లేకపోతే లేదని చెప్పి తిప్పి పంపించేసేవారు. పైగా తూకంలో విపరీతంగా మోసాలకు పాల్పడేవారు. ఇప్పుడు ఆ బాధల నుంచి విముక్తి కలిగింది. ఇంటి వద్దకే వచ్చి మొత్తం అన్ని సరకులను శుభ్రంగా కొలిచి, మరీ ఇస్తున్నారు.
– సిరం కల్యాణి, 75వ వార్డు, నెల్లిముక్క

ఉపాధి దొరికింది



నాకు డ్రైవింగ్ వచ్చినా ఉపాధి లేక ఇబ్బంది పడేవాడిని. సీఎం జగన్ మోహన్ రెడ్డి రేషన్ పంపిణీలో కొత్త విధానానికి శ్రీకారం చుట్టి మాలాంటి వారికి ఉపాధి కల్పించారు. ఈ పనితో నేను నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నేను వాహనం తీసుకుని వీధిలోకి రాగానే లబ్ధిదారులు వచ్చి సరకులు విడిపించుకుంటున్నారు. వలంటీర్లు దగ్గరుండి అందరికీ అందేలా చూస్తున్నారు.
– ఐ.సాయి, రేషన్ వాహనం డ్రైవర్, పెదగంట్యాడ

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1096వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులతో పాటు గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. రానున్న కాలంలో ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మొల్లి అప్పారావు, నెల్లి అప్పలరాజు, పోలవరపు రమణబాబు, జైకుమార్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఆటోలో వెంబడించి వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ
- సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితుల గుర్తింపు



చిరుపాటి రాజు



చేపల ఆనంద్



కంబాల శ్రీ రాజు

అక్కిరెడ్డిపాలెం: వాకింగ్ చేస్తున్న వృద్ధురాలిని ఆటోలో వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నగదు చోరీ చేసిన ముగ్గురు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆ బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురానికి చెందిన షియా ప్రసాద్‌సింగ్ (84) గత నెల 24న గొందేశిపాలెంలో వాకింగ్ చేస్తుండగా.. పెదగంట్యాడకు చెందిన చేపల ఆనంద్, కంబాల శ్రీరాజు, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజు ఆటోలో వెంబడించి ఆమె మెడలోని తులం బంగారు చైన్‌ను తెంచుకుపోవడంతోపాటు, ఆమె వద్ద గల నగదును కూడా లాక్కుని పరారయ్యారు. ఆమె వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగల ఆచూకీని కనిపెట్టారు. విచారణలో ముగ్గురూ నేరం చేసినట్లు తేలడంతో, సోమవారం వారిని అరెస్ట్ చేసి, బంగారం, నగదుతో పాటు మద్యం సీసాలు, ఇనుప రాడ్డు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన దిగువ జాలారిపేటకు చెందిన సీహెచ్ ఎల్లాజీ (35)ని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏడీసీపీ గంగాధరం, జోన్-2 క్రైం ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మధరావు, ఏఎస్ఐ రవి, కానిస్టేబుళ్లు కేసు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించగలిగారన్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిపారు. ఆటో నంబర్ ప్లేట్ సరిగ్గా లేకపోయినా, పాతకేసును తిరగదోడి నిందితులను గుర్తించారని, సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వారిని పట్టుకోగలిగారని తెలియజేశారు.

ఏపీఎండీసీకి ఏయూ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ముగ్గురు ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూ ఎంహెచ్‌ఆర్ఎం కోర్సు చదువుతున్న ఎం.రవిశ్రీ కిరణ్, ఎం.ఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఏపీఎండీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, ఆర్ట్స్-కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్, తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 700 మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తెలిపారు.

హైస్కూల్స్ సందర్శించిన ఎల్ఐపీ బృందం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో విశ్వనాథం, పాల్గొన్న బృందం సభ్యులు

గాజువాక : గాజువాక మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(ఎల్ఐపీ) బృందం సోమవారం సందర్శించింది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల్లో భాగంగా మండల విద్యాశాఖాధికారి బి.విశ్వనాథం ఆధ్వర్యంలో పాఠశాలలను సందర్శించిన బృందం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి ఎల్ఐపీ నిర్వహణ తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో నోడల్ ఉపాధ్యాయుడు ఎం.కృష్ణారావు, గాజువాక ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.అర్చకుడు రఘునాథ్ తదితరులు ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరాలి



పాత్‌వే ప్రారంభిస్తున్న సీజీఎస్టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

కొమ్మాది: ఆత్మవిశ్వాసంతో అంధ విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీజీఎస్టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ సూచించారు. సాగర్ నగర్ సమీపంలో గల అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పాత్‌వే (నడక మార్గం)ను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజీఎస్టీ డిపార్టుమెంట్ రూ.3.50 లక్షలతో పాఠశాలలో పాత్‌వేను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి



ప్రభుత్వ పథకాల కరపత్రాలను లబ్ధిదారుకు అందిస్తున్న ఉరుకూటి చందు

కూర్మన్నపాలెం: మాట తప్పని, మడమ తిప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఆయనకే చెందుతుందన్నారు. జీవీఎంసీ 87వ వార్డు ఎరుకుల వీధి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చందు పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ అవినీతి, అసమర్థ పాలనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, సారిపల్లి దేవుడు, సీరపు పాపారావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, సీతారామరాజు, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, బెల్లంకొండ, కోనేటి పారిపల్లి, సారిపల్లి రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, మార్పు శేషు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు సత్కారం



జెడ్సీ ప్రసాదరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలను చేపట్టిన పి.వి.వి.డి.ప్రసాదరావును గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం సత్కరించారు. జెడ్సీకి పుష్పగుచ్ఛాలను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. జెడ్సీని కలిసిన వారిలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, నాయకులు ధర్మాల శ్రీనివాస్‌రెడ్డి, చిత్రాడ వెంకట రమణ, పిట్టా రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు, బొడ్డ గోవింద్, పల్లా పెంటారావు, ములకలపల్లి వెంకటేష్ తదితరులున్నారు.

సచివాలయం ఉద్యోగుల సన్మానం : జెడ్సీ ప్రసాదరావును గాజువాక నియోజకవర్గ సచివాలయాల ఉద్యోగులు సత్కరించారు. సచివాలయ ఉద్యోగుల డెమొక్రటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెడ్సీకి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.ఎ. సూర్య, సభ్యులు నాయుడు, ప్రసాదరావు, రజియా బేగం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్యాన సంస్మరణోత్సవం



సంస్మరణోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బ్రహ్మ విద్యార్షిష్ట తాడి వీర జగదీశ్వరి తృతీయ ధ్యాన సంస్మరణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్స్ పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ధ్యానం, శాకాహార విశిష్టత కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. దేశ విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో ధ్యానం ప్రాముఖ్యతను వివరిస్తూ ఎంతోమందిని ధ్యానులుగా తీర్చిదిద్దిన ఘనత ఆమెదేనన్నారు. మాడుగులలో విశ్వశాంతి పిరమిడ్ శక్తి క్షేత్రాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మీసాల శివగణేశ్వరరావు, సీనియర్ మాస్టర్స్ లక్ష్మీరాజ్యం, వనిత, లక్ష్మీసుబ్బారావు, అప్పారావు, మూర్తి, బాలాజీ, పద్మావతి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. 65వ వార్డు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా రూ.5లక్షల విలువైన వైద్యాన్ని పొందవచ్చని సూచించారు. మహిళాభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. జోనల్ కమిషనర్ ప్రసాదరావు, పోస్టల్ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారి నీలవేణి, తారక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న చందు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పాత వడ్లపూడిలోని రథాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్నాధం, ఈర్లి శ్రీరాములు, గాలి నూకరాజు, గాలి సాదూరావ్, జామి రామకృష్ణ, పట్నాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సైకాలజీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సుల్లో పాల్గొని, పలు అవార్డులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల నూతన జ్ఞానాన్ని నిపుణుల నుంచి పొందడం సాధ్యపడుతుందన్నారు. శాస్త్ర సంబంధంగా జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



తాడి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

పరవాడ: తాడి రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం కనుగొన్నారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లుఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై సిమెంట్ కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ఫుల్ ట్రాక్, డ్రాయర్ ఉంది. ఎడమ కాలికి నల్లని దారం, ఎడమ చేతికి సిల్వర్ కలర్ ఉంగరం ఉంది. ఎత్తు 5.7 అంగుళాలు, తెలుపు రంగు, మాసిన గెడ్డం కలిగి ఉన్నాయని దువ్వాడ జీఆర్‌పీ పోలీసులు చెప్పారు. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.